# కుక్క పిల్ల

"సార్ కుక్కని చూశారా ?

అదేమిటండి, మనం కుక్కల్ని రోజూ చూస్తుంటాంగధా! అన్నానేన్నేను అతనివంక తదేకంగా చూస్తూ.

"అబ్బే, అదికాదండి. మా కుక్క... టామీని చూశారా ?"

"అదా! చంపేశారు. మీ టామీ నెరకక్కేం - రోజూ మా ఇంట్లో జొరబడుతుందిగా".

"అదికాదండి స్వామీ! ఇప్పుడెక్కడైనా మా టామీని చూశారా అని అడుగుతుంట".

"అబ్బే తెలీదండి - ఏమైంది ?"

అదే తెలీదండి. గంట నుంచి కనిపించటం లేదు"

ఆ మాట అంటున్నప్పుడు అతడు ఏదో దగ్గిర బంధువుల్ని పోగొట్టు కున్నా వాడిలా దీనంగా అవుపించాడు.

నాకు అతణ్ని చూస్తుంటే మహా సంతోషం వేసింది - కారణం ఆ టామీ అనబడే కుక్కపిల్ల మా యింట్లో చేసిన అరాచకాలు చాలా వున్నాయ్. అందుకే అందామనుకున్నా - పోన్లెండి 'పోతే పోయింది, అనవసరంగా వర్రీ కాకండని'

కాని ఆమాట విని తానే టామీగా మారి గొడవ చేస్తాడన్న భయంతో. మెల్లిగా, ఓదార్పుగా " అదే వస్తుంది కంగారు పడకండి " అని మాత్రం అన్నాను.

అతడి పేరు అవధాన్లు, నా పక్క వాటాలోకి అద్దెకొచ్చి ఏడాదవు తోంది. ఏదో కంపెనీలో పన్చేస్తాట్ట, జీతం గట్రా బాగా వస్తాయిలా

వుంది. వెఫవ్వేషాలు చాలా వేస్తాడు. వాటిల్లో ఈ కుక్కపిల్ల పెంపకం ఒకటి.

అసలు నా పక్క వాటాలో కొచ్చినపుడు కుక్కల్లేవు- ఇద్దరు పిల్లలు తప్ప. మరి ఎక్కడినించి తెచ్చాడో, ఎలా వచ్చిందో, ఒక రోజు తెల్లవారేసరికి ఒక మీటరు పొడుగు ఇనుప గొలుసుతో ప్రత్యక్షమైనాడు. ఆ గొలుసు చివర ఓ కుక్కపిల్ల - తెల్లటి రంగు, రెండు మూడు చోట్ల నల్లటి మచ్చలు - కాళ్ళు అతికించినట్లుగా వున్నయ్.

చాలా ఉత్సాహంగా, ఆరోగ్యంగా వుంది. నాకు దాన్ని చూస్తే మన వైపు కుక్కలా కన్పించలేదు.

అతగాడు దాన్ని కాలకృత్యాలు తీర్చటానికి రోడ్డెక్కించి నట్లున్నాడు.

చెప్పొద్దూ! ఆ క్షణాన దాన్ని చూస్తే నాకూ ముచ్చటనిపించింది. కాని అటు తర్వాత దాని ఆగడం మితిమీరినప్పుడు గాని నాకు కుక్కలంటే ఏవగింపు కలగలేదు.

అవధానులు రోజూ ఎనిమిదింటికల్లా కంపెనీ కెళ్ళిపోయేవాడు. పోతూ పోతూ ఆ కుక్కని భద్రంగా ఏ మంచానికో ఇంకాదేనికో బంధించి మరీ వెళ్ళేవాడు. అది 'కుయ్ కుయ్' మని ఏడుస్తూనే వుండేది. పక్కవాటాలో వున్న నాకేమో కొంచం ఆలస్యంగా నిద్రలేవటం అలవాటు. కాని ఈ టామీ వచ్చిన దగ్గర్నించి రోజూ అలారం కొట్టినట్లు ఎనిమిదింటికల్లా నిద్రాభంగం, దాంతో నేను మా ఆవిడ మీద చిర్రు బుర్రులాడటం (ఇంక ఏం చెయ్యాలో తెలీక). మా ఆవిడ దానికి రెట్టింపుగా బిగుసుకు పోయి మూగనోము పట్టటం...

అంటే పరోక్షంగా ఈ టామీ నా దాంపత్య జీవితంలో జోక్యం కల్పించుకున్నదన్న మాట.

సరే అదలా వుంచండి. ఇంకో విషయం-

ఒకసారి మా కుర్రవాడు, మూడేళ్ళ వెధవ, ఆడుకోటానికని పక్క వాటాలో కెళ్ళాడు పిల్లలుగదా! వాళ్ళకేం తెలుస్తుంది. కాస్త ఆ టామీతో చనువుగా వుండబోయాడు కాబోలు - వాడి కాలుని రుచిచూసి వదిలింది. వాడి ఇంజక్షన్లకి, మందులకి అయిన అప్పు నాకింత వరకూ తీర్లేదు.

అప్పటినించి నేను దాన్ని ద్వేషించటం మొదలుపెట్టాను. ఒక దశలో దీన్ని మున్సిపాలిటీ వాళ్లు తీసికెళ్ళినా బాగుండు అని గూడా అనుకున్నాను.

కాని అలా జరగలేదు-ఎలా మాయమయిందో తెలీదు. మొత్తానికి నా కష్టాలు గట్టెక్కినాయ్.

కాని అవధాన్లు పరిస్థితి చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది.

మామూలుగా, మనిషి డబ్బు తప్ప ఇంకేది పోగొట్టుకున్నా పెద్దగా పట్టించుకోడని నేనిన్నాళ్ళుగా నమ్మిన విషయం.

తల్లిదండ్రి పోయిన వాళ్ళలో గీయించుకున్న గుండు తప్ప, విచారం కాగడా వేసి వెతికినా కన్పించదు.

భార్య పోగొట్టుకున్న వాడు నెల తిరక్కుండానే మళ్ళీ పెళ్ళిచూపుల కెళ్ళటం నాకు తెలుసు.

అతి గారాబంగా పెంచుకున్న పిల్లల్ని పోగొట్టుకున్న తల్లిదండ్రులు కూడా, రెట్టింపు ఉత్సాహంతో మరుసటి ఏటికల్లా పిల్లని కనేసి, కళకళ ల్లాడుతూ తిరగటం చాలామందికి తెలుసు.

కాని అవధాన్లు పరిస్థితి నాకంతుబట్టటం లేదు. టామీ మాయమయిన తరువాత రెండు రోజులు అవధానిగూర్చి నేను పెద్దగా పట్టించుకోలేదు. కాని మూడో రోజు నేనాఫీసునుంచి వచ్చేసరికి గడపలో కూర్చొన్న అవధాన్లని చూశాక నిజంగా నాకు కంగారేసింది.

మొహం ముప్పయ్ లంకణాలు చేసిన వాడిలాగా పీక్కుపోయింది.

గడ్డం బాగా మాసిపోయింది. తల్లో దువ్వెన పెట్టి ఎన్నాళ్ళయిందోగాని తలంతా అడవికుక్కలేని ఇల్లులా గందరగోళంగా వుంది.

అతడి వాలకం చూసిన నాకు భయం వేసింది. "ఏమిటిలా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా?" అడిగాను / అసలు విషయం ఏమై ఉంటుందా అన్న ఆసక్తితో.

అతగాడు ప్రేయసిని పోగొట్టుకున్న ప్రియుడిలా ఒక ఫీలింగ్ నా మొహాన పారేసి, "ఆరోగ్యం నిక్షేపంలా వుంది. కాని టామీ సంగతి మర్చి పోలేకుండా ఉన్నాను" అన్నాడు నిర్లిప్తంగా.

ఒక పక్క అది పోయినందుకు నాకు సంతోషంగా వున్నప్పటికీ అతని పరిస్థితి చూశాక జాలేసింది. ఏమైపోతాడో నన్న భయం పట్టుకుంది. అందుకే ఓదార్పుగా, అనునయంగా "అన్ని చోట్ల వెదికారా?" అని అడిగాను. అవధాన్లు రెండుచేతులు నెత్తిమీదుంచుకుని "వెదికానండీ ప్రతి ఇల్లు, ప్రతి సందు గాలించాను. ఒకవేళ పొరపాటున మునిసిపాలిటీ వాళ్ళు పట్టు కెళ్ళారేమోనని అక్కడికూ్కడా వెళ్ళి చూశాను. కాని లాభం లేక పోయింది అసలిదంతా నా ఖర్మలెండి. ఆ ముండా కొడుకు వెడ్తూ వెడ్తూ నాకే అప్పగించాలా చెప్పండి నా ఖర్మకాకపోతే" అనేశాడు. దాంతో ఇంకో విషయం బయట పడింది, అంటే టామీ గురువుగారిది కాదన్నమాట.

నాకాసక్తి పెరిగి అతడి పక్కన చతికిల పడుతూ "అంటే అది మీది కాదా?" అడిగాను

అతడు నిట్టూర్పు విడిచి, పెరిగిన గడ్డాన్ని కసిగా గోక్కుంటూ నాకు సమాధానం ఇస్తున్నట్లుగా అన్నాడు "నాది కాదండి నా దయయితే మీరన్నట్లుగా పోతే పోయిందిలే అని వూరుకునుండేవాడిని. కాని అది మా 'బాస్'ది. అయనకి కుక్కలంటే పంచప్రాణాలు. ఆయనీ మధ్య ఫారన్ వెడ్తూ దాని ఆరోగ్యం సరిగాలేదని, ఇంట్లో నౌకర్లు దాని ఆలనా పాలనా

సరిగ్గా చూడరని నా కప్పగించి అవధానీ ! నీ మీది నమ్మకంతో నా టామి పోషణ భారం నీ కప్పగిస్తున్నాను ఎలా చూస్తావో ఏమో?, అని చెప్పి మరీ వెళ్ళాడు. ఇప్పుడిదిట్లా నన్ను అన్యాయంచేసి పోయింది. ఇవ్వాళ్ళో రేపో ఆయన రానే వస్తాడు. ఏం చెప్పాలో ? అది విని ఇంకేం చేస్తాడో" కంఠం బొంగురు పోయింది.

అతడి వాలకం చూస్తే జాలివేసింది. "ఆందోళన పడకండి. మీ 'బాస్' మాత్రం ఏమంటాడు ? పోయింది - ఎక్కడికి పోయిందో నాకు తెలీదు - కావాలంటే ఇంకో కుక్కని తెచ్చిస్తానని చెప్పండి అయినా మన దేశంలో కుక్కలకేం కొదవుంది చెప్పండి" అన్నాను అతడి మూడ్స్ మార్చాలన్న వుద్దేశంతో. "మీకు తెలీదండి - వాడు తినేస్తాడు. నన్ను వుద్యోగంలోంచి తీసేసినా ఆశ్చర్య పడనక్కర్లేదు. ఒకసారి మా కంపెనీలో పన్చేసే వర్కరు వాడి కుక్కని కాలితో తన్నాడని రెండేళ్ళు ఇంక్రిమెంట్లు ఆపేశాడు. అంత పిచ్చిముండాకొడుకు. తిరిగివచ్చాక నీ ప్రమోషన్ గూర్చి ఆలోచిస్తాన్లే అన్నాడు. ఇంక ప్రమోషన్లేదూ, వల్లకాడూ లేదు, ఉద్యోగం పోకుండా వుంటే చాలు" చివరి మాటలు తనలో తానే అనుకుంటున్నట్లుగా గొణుగుతూ అన్నాడు.

ప్రైవేటు ఉద్యోగాల్తో వచ్చిన చిక్కే యిది. అధికారి అలిగాడంటే మన పునాదులు కదిలాయన్నమాటే! అందుకే కాబోలు చాలామంది పది రూపాయలు తక్కువస్తాయని తెల్సినా ప్రభుత్వోద్యోగాల కోసం పాకులాడ తారు. దిగుల్లేని బతుకులవి !

ఇక అవధాన్లని అతడి అదృష్టాని కొదిలేసి, నేను శలవు తీసుకుందామని వెళ్ళబోతూ అన్నాను "పోనీ అలవాటుకొద్దీ టామీ మీ 'బాస్' ఇంటికెళ్ళిందేమో చూశారా?"

ఆ మాట విన్న అతడి కళ్ళల్లో కొత్త ఆశ తళుక్కున మెరిసింది. ఆ

ఆలోచన తనకి రానందుకు, నా కొచ్చినందుకు తనని తాను నిందించుకుంటు న్నట్లు నన్ను అభినందిస్తున్నట్లు వున్నాయి అతడి చూపులు.

"మంచి పాయింటు చెప్పారు. ఇంతవరకు నాకు తట్టనేలేదు చూశారా? మీరు మరోలా అనుకోకపోతే-ఇద్దరం కల్సివెళ్ళి చూసేసి క్షణంలో వచ్చేద్దాం వస్తారా?" అడిగాడు,

నా పరిస్థితి అదేదో సామెత చెప్పినట్లయింది. కాదనలేకపోయాను "సరే నడవండి" అంటూ కదిలాను.

ఇద్దరం కల్సి రోడ్డుమీదకొచ్చి ఆటో పిల్చి కూలబడ్డాం. ప్రయాణం చేస్తున్నంతసేపు అతడేదో చెబుతూనే వున్నాడు. కొన్ని విన్నాను. కొన్ని వినలేదు. కాని ఈ గండం గడిస్తే ఏ ఏ పుణ్యక్షేత్రాలు దర్శించాలనుకుంటు న్నాడో చెప్పిన వివరాలు మాత్రం విన్నాను.

మొత్తానికి పావుగంట ప్రయాణం తర్వాత, ఆటోని ఆపించి తనుదిగాడు. నేనూ దిగింతర్వాత "అదే మా బాస్ బంగళా" అంటూ కాస్తదూరంలో కని పిస్తున్న ఒక భవంతిని చూపించాడు -

రెండతస్తుల భవనం. ముందు అందమైన గార్డెన్, రకరకాల పూల మొక్కలు, గేటు కిరువైపుల రెండు పోకచెట్లు.

లోపలంతా లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నయ్.

ఆ ఇంట్లో వెలుగుతున్న లైట్లని చూసేసరికల్లా మనవాడి మొహంలో కాంతి మాయమయింది. "కొంపదీసి అప్పుడే వచ్చేశాడా" అనుకుంటూ నా కన్నా ముందుగా గేటువద్దకెళ్ళి అక్కడున్న గూర్ఖాని "అయ్యగారొచ్చారా?" అని అడిగాడు

వాడు "వచ్చి గంటయింది" అన్నాడు సహజ కటుత్వంతో. ఆ మాట విన్న అవధాన్లకి కంగారెక్కువయింది. అది గమనించిన నేను "అసలు టామీ చేరిందేమో కనుక్కోండి" అని హెచ్చరించాను. అప్పుడుగాని వచ్చిన పని గుర్తు రాలేదు. మళ్ళీ కాపలావాడిని అడిగాడు "టామిగానీ వచ్చిందా?" అని.

వాడు మొహాన్ని అదోలా పెట్టి "నే చూడ్లేదాన్సర్" అన్నాడు.

బాస్ ఊరెళ్ళగానే వాడూ శలవు తీసుకుని, మళ్లీ ఇప్పుడే వచ్చినట్టు అలంకారంగా కూర్చొన్నాడని వాడికి తప్ప ఇంకెవ్వరికీ తెలీదు.

అవధాన్లు కంగారు మరీ ఎక్కువయి చలిజ్వరం వచ్చిన వాడిలాగా వణికిపోసాగాడు.

నేను నిబ్బరంగా "అనవసరంగా కంగారుపడకండి. సరాసరి లోపలికెళ్ళి మీ బాస్‌కి జరిగింది జరిగినట్టు చెప్పేసి తప్పు ఒప్పేసుకోండి. తప్పక క్షమిస్తాడు" అన్నాను.

"అంతేనంటారా ?" దీనంగా అన్నాడు.

అంతేనన్నట్లుగా తలూపాను. 'సరే పదండి' అంటూ లోనికి దారి తీసాడు. నేనూ అనుసరించాను.

ఇద్దరం హాల్లోకెళ్ళి మెత్తటి సోఫాల్లో కూర్చున్నాక నౌకరుచేత పైకి కబురు పంపించాడు అవధాన్లు.

లోపలి ఇల్లు సినిమాలో జమీందారు బంగళా సెట్టింగులా వుంది. కాళ్ళకింద ఖరీదైన సోఫా సెట్లు, గోడలకు అర్థంకాని తైలవర్ణ చిత్రాలు, పూలగుత్తుల్లా వ్రేలాడుతున్న అధునాతనమైన లైట్లు.

చూట్టానికి చాలా కనువిందుగా వుంది.

నేను అలంకారాలన్నిటిని చూసి ఆశ్చర్యపోతున్నంతసేపు అవధాన్లు కళ్ళు మూసుకుని ఏదో తీవ్రంగా ఆలోచించసాగాడు. అలా ఆలోచిస్తున్న అతడి మొహం ఒక్కసారిగా ప్రసన్నం అవటం గమనించి నేను ఆశ్చర్యపోయాను.

కారణం తెల్సుకుందాం అనుకున్నంతలో మెట్లపై అలికిడి విని తల తిప్పి చూశాను.

ఒక స్థూలకాయుడు, లాంగ్ కోటులో వున్నాడు. గుబురు మీసాలు

అతడి మొహానికి ఎంతో అందంగా వున్నాయనిపించింది. బట్టతల, పచ్చని శరీరఛాయ, అతడు శ్రీమంతుడనీ చెబుతున్నట్లుగా వున్నయ్.

ఒక చిరునవ్వుని గుబురు మీసాల్లోంచి బయటికి ప్రదర్శిస్తూ వచ్చి మా కెదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ "హల్లో జెంటిల్‌మెన్ హౌ ఆర్ యూ" అన్నాడు

అవధాన్లు ఏం మాట్లాడక, ఏడ్వలేక ఒక నవ్వు నవ్వి "అప్పుడే వచ్చారేం సార్. ఇంకా మూడ్రోజుల్దాకా రారనుకున్నాం" అన్నాడు.

ఆ పెద్ద మనిషి ముసి ముసిగా నవ్వుతూ "వెళ్ళిన పనయి పోయింది. ఇంకా వుండాలనిపించలేదు. అయినా 'టామీ' ఎలా వుందోనని ఆదుర్దాతో వచ్చేశాను" అని మాట్లాడటం ఆపి అతడిని తీక్షణంగా చూస్తూ "ఏవిటలా వున్నారు? ఆర్ యూ ఆల్ రైట్" అని అడిగాడు,

నేను అన్నీ గమనిస్తూ కూర్చుండి పోయాను.

అవధాన్లు తనలోని తొట్రుపాటుని దాచి పెట్టాలని ప్రయత్నిస్తూ "నేను బాగానే వున్నాన్సార్... కాని మీరు లేనప్పుడు ఒక ఘోరం జరిగి పోయింది" బెరుగ్గా అన్నాడు.

బాస్ మొహంలోని ప్రసన్నత మాయమయింది "ఎనీ థింగ్ రాంగ్? కటువుగా అడిగేడు.

అవధాన్లు ఒక్కసారి నావంక చూసి, తర్వాత మెల్లిగా "అవున్సార్ మన టామీ...మన టామీ చచ్చిపోయిందండి" అన్నాడు.

ఆ మాట విన్న ఆ బాస్ మొహం ఎర్రగా ఎంత కందగడ్డలా అయిందో, నాకంతకన్నా ఎక్కువాశ్చర్యం వేసింది. ఆ మాట నేనూ అవధాన్లు నోటి నించి ఊహించలేదు. దీని పరిణామం ఎలా వుంటుందో చూద్దాం అన్న ఆసక్తి కొద్దీ అలాగే ఆ బాస్ మొహం వంక చూస్తూ కూర్చున్నాను. బాస్‌కి ఒంట్లో వున్న నెత్తురంతా మొహంలోకొచ్చినట్లుగా వుంది. కోపంగా అరిచాడు "వాడ్డూ యూ మీన్" అని.

అవధాన్లు తడబడుతూ "అవున్సార్... అసలు మీరు వెళ్ళేసరికే మన టామీ ఆరోగ్యం బాగాలేదు కదండీ. మీరెళ్ళిన మర్నాడు రాత్రి ఒక్కటే

మూల్గటం-తెల్లగా వుండే టామీ ఎర్రగా అయి పోయిందండి. అప్పటికప్పుడు ఆస్పత్రికి తీసికెళ్ళాను. కాని లాభం లేకపోయింది. మనిద్దర్నీ అన్యాయం చేసి వెళ్ళిపోయింది" అంటూ ఘొల్లుమన్నాడు. పక్కనే కూర్చుని గమనిస్తున్న నాకు అమితమైన ఆశ్చర్యం వేసింది. గురుడు ఎంత సహజంగా, లయబద్ధంగా ఏడుస్తున్నాడా అని! ఒకవేళ ఉద్యోగం పోయినా సినిమాల్లో ఏడుపు సీన్లో పనికొస్తాడు అని కూడా అనుకున్నాను.

కాని వాళ్ళ బాస్ మాత్రం నిశ్చలంగా కూర్చున్నాడు. తాపీగా జేబులోంచి పైపుతీసి క్లీన్‌చేస్తు "స్టాపిట్-" అని కటువుగా హూంకరించి మెట్లవైపు తిరిగి అదో రకంగా, తమషాగా ఈల వేశాడు.

అతడి చేష్టలు నాకు బొత్తిగా అర్థం కాలేదు.

అవధాన్లు ఏడ్వటం ఆపి ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

అంతలో పైనించి వచ్చింది - గున గున లాడుతూ, అతి ఉత్సాహంగా గెంతుతూ, చిటుక్కున వచ్చి యజమాని ఒళ్ళో దూరింది-టామీ!

నాకు టామీని చూసేసరికల్లా ఆపుకోలేని నవ్వొచ్చింది. బాస్ మాత్రం గంభీరంగా, అవధాన్ల వైపు చూస్తు "నీ మీదున్న అభిమానం, నమ్మకంతో బాధ్యతగల ఉద్యోగంలోకి ప్రమోట్ చెయ్యాలనుకున్నాను. కాని యు హేవ్ ఫెయిల్డ్. నీ కప్పగించిన ఈ చిన్న బాధ్యతనే నెరవేర్చలేనివాడివి - నోనో దీనికి నీకు ఏటువంటి శిక్ష విధించాలో రేపు తేలుస్తాను. నౌ యు కేన్ గో" అనేసి టామీని తీసుకొని మెట్లెక్కి పై గదుల్లోకి మాయమయ్యాడు.

నేను అవధాన్లు వంక చూడదల్చుకోలేదు. తీరా చూశాక నవ్వాగక నవ్వేస్తే అతడికి కోపం రావచ్చు.

అందుకే లేచి మెల్లిగా బయటకొచ్చాను.

బయట చంద్రుడు విరగబడి నవ్వుతున్నాడు.

వెన్నెలని ఆ యింటి మీద, ఆ ప్రాంగణంలోనూ ఒలకపోసుకుని మరీ నవ్వుతున్నాడు.

నేనూ అతడితోపాటు శృతికల్పాను.

(విపుల మాసపత్రిక, 1979)

# జల్దీ పీలు

బొంబాయిలో వుంటూ చుట్టం చూపుగా వచ్చిన తల్లీ పిల్ల వాడికి కాఫీ యిచ్చింది బామ్మగారు. కాఫీ వేడిగా ఉండడం చేత ఆ పిల్లవాడు మెల్లిమెల్లిగా త్రాగుతున్నాడు. అది చూసిన ఆ తల్లి హిందీలో 'జల్దీ పీలో- జల్దీ పీలో' అంటూ తొందర చేయసాగింది.

కాస్సేపు వినివిని బామ్మగారు కోపంతో 'పీలుస్తాడు లేవే- పీలు పీలంటూ వాడివెంట పడ్డావేం' అంటూ మందలించింది.

o o o

అదే బామ్మగారెప్పుడైనా టైమడిగినపుడు 'తొమ్మిది నలభై అయిందం'టే ఇంతేనా అని చప్పరిస్తుంది. 'పావుతక్కువ పదం'టే అమ్మో టైం ఏం పరిగెడుతోంది- అంటుంది.